పగలే వెలుగులు..!



గోపన్‌పల్లితండా రోడ్డులో వెలుగుతున్న స్ట్రీట్ లైట్లు

రాయదుర్గం: గోపన్‌పల్లి తండా ఫ్లైఓవర్ సమీపంలోని రోడ్డుపై వీధిదీపాలు నిత్యం వెలుగుతూనే ఉన్నాయి. రోజు ఉదయమే వాటిని ఆఫ్ చేయాల్సి ఉండగా పట్టించుకోకపోవడంతో పగలు కూడా వెలుగులు విరజిమ్ముతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు సత్వరమే స్పందించి తగు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి కృషి

పటాన్‌చెరు టౌన్: మత్స్యకారుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్ అన్నారు. సోమవారం మండలంలోని ఇస్నాపూర్‌లో మత్స్యకారులతో మాట్లాడారు. గత కొన్ని సంవత్సరాలుగా మత్స్యశాఖలో సభ్యత్వం, కాలుష్యం వలన జీవనోపాధిపై వారితో చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడారు. గతంలో ఈ సమస్యపై తాను డీఫ్ఓ, పీసీబీ అధికారుల దృష్టికి తీసుకెళ్లానని తెలిపారు. అధికారులు పరిష్కార చర్యల దిశగా అడుగులేస్తున్నారని, ఇస్నాపూర్‌లో నూతన సంఘం ఏర్పాటుకు సహకరించినట్లు గుర్తు చేశారు. పాశమైలారం పారిశ్రామిక వాడలో వెలువడుతున్న కాలుష్యం కారణంగా ఇస్నాపూర్, చిట్కుల్ ప్రాంతంలో చెరువులు విషపూరితంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. అందరి సహకారంతో నియోజకవర్గంలో మత్స్యకారుల అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం గ్రామ అధ్యక్షుడు రాఘవేందర్, పెంటయ్య, నర్సింలు, వెంకటేశ్, గోపాల్, రవి, మల్లేష్, మనోహర్, శ్రీనివాస్, మల్లేశం, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతీ సంప్రదాయాల్లో ముగ్గులకు విశిష్టత

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



పోటీల్లో గెలుపొందిన మహిళలకు ఫ్రిజ్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: హిందూ సంస్కృతీ సంప్రదాయాల్లో ముగ్గులకు ఎంతో విశిష్టత ఉందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని సోమవారం మండల పరిధిలోని ముత్తంగి సాయిప్రియ కాలనీలో ఏర్పాటుచేసిన ముగ్గుల పోటీల కార్యక్రమానికి మహిపాల్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...సంక్రాంతి పర్వదినం పురస్కరించుకుని మహిళల కోసం ముగ్గుల పోటీలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. పండుగ విశిష్టతను ప్రతిబింబించేలా ముగ్గులు వేయడం పట్ల మహిళలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పోటీలలో పాల్గొన్న 126 మంది మహిళలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అమీన్‌పూర్ మాజీ జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఉపేందర్, మాజీ వైస్ ఎంపీపీ స్వప్న శ్రీనివాస్, మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

క్లీన్ సిటీగా మార్చడమే లక్ష్యం

శేరిలింగంపల్లి ఉపవైద్యాధికారి శ్రీకాంత్‌రెడ్డి



పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

గచ్చిబౌలి: హైదరాబాద్‌ను క్లీన్ సిటీగా మార్చడమే లక్ష్యంగా పని చేస్తున్నామని శేరిలింగంపల్లి సర్కిల్ ఉపవైద్యాధికారి శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో పారిశుధ్య పనులను సోమవారం తెల్లవారుజామున పరిశీలించారు. అనంతరం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ.. తెలంగాణలోని పలు జిల్లాలు, వివిధ రాష్ట్రాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో హైదరాబాద్‌కు వచ్చి జీవనోపాధి పొందుతున్నారన్నారు. వారిలో కొంతమంది ఇక్కడే సంక్రాంతి పండుగను జరుపుకుంటుండగా, మిగితావారు తమ సొంత ఊర్లకు వెళ్లారన్నారు. ఇళ్ల నుంచి చెత్త సేకరణ తగ్గిపోయిందని, కానీ కమర్షియల్ ప్రాంతాల్లో మాత్రం తగ్గలేదన్నారు. క్లీన్‌సిటీ రూపకల్పనలో జీహెచ్‌ఎంసీ చేపట్టే పనులకు ప్రజల నుంచి సంపూర్ణ సహకారం అవసరమని పేర్కొన్నారు.



మాతృశ్రీనగర్‌లో భోగి మంటలు వేసిన స్థానికులు



అపర్ణాగ్రాండే గేటెడ్ కమ్యూనిటీలో భోగి మంటలు వేసిన స్థానికులు





దోయన్స్‌కాలనీలో ..

సందడే.. సందడి

- మొదటిరోజు వైభవంగా 'భోగి' వేడుకలు
- భోగి మంటలు, ముగ్గుల పోటీలు

శేరిలింగంపల్లి జంట సర్కిళ్లలో సంక్రాంతి సంబురాలు షురూ



శేరిలింగంపల్లిలో పతంగులు విక్రయిస్తున్న దృశ్యం



శేరిలింగంపల్లి తారానగర్‌లో ముగ్గు పిండిని విక్రయిస్తున్న దృశ్యం

గచ్చిబౌలి/హఫీజ్‌పేట్: శేరిలింగంపల్లి జంట సర్కిళ్లలో సోమవారం సంక్రాంతి సంబురాలు అంబరాన్నంటాయి. సంక్రాంతి అనగానే మూడురోజుల పండుగ. అందులో మొదటిరోజు నిర్వహించే 'భోగి' వేడుకలను కొండాపూర్, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి, చందానగర్, హఫీజ్‌పేట్, మియాపూర్, మాదాపూర్ డివిజన్ల పరిధిలోని కాలనీలు, బస్తీలు, గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్‌మెంట్ల వాసులు వైభవంగా జరుపుకున్నారు. తెల్లవారుజామునే 'భోగి' మంటలు వేసి ఉత్సాహంగా గడిపారు. మరోవైపు కాలనీలు, బస్తీ, గేటెడ్ కమ్యూనిటీ, అపార్ట్‌మెంట్ల వాసులు తమ ఇళ్ల ముందు రంగురంగుల ముగ్గులు వేసి గొబ్బెమ్మలు పెట్టారు. మరోవైపు తారానగర్ మార్కెట్‌లో పతంగులు కొనుగోళ్లు జోరుగా జరిగాయి. రూ.10 నుంచి మొదలు రూ.250 వరకు విక్రయించారు.

'అపర్ణాగ్రాండే'లో..

శేరిలింగంపల్లి: నల్లగండ్లలోని 'అపర్ణాగ్రాండే' గేటెడ్ కమ్యూనిటీలో పూజలు చేసి భోగి మంటలు వేశారు. అంతకుముందు మహిళలు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. పూజల అనంతరం ప్రసాదం తయారు చేశారు.

శిల్పారామంలో ..

మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పారామంలో హరిదాసులు, గంగిరెద్దులు, పిట్టలదొర, ఎరుకలసాని, బుడబుక్కల, జంగమదేవరలు సందడి చేశారు. అలాగే కళాకారులు పాటలు, వివిధ రకాల విన్యాసాలతో నగరవాసులను అలరించారు. సౌత్‌జోన్ కల్చరల్ సెంటర్ తంజావూర్ ఏర్పాటు చేసిన గారడీ గొంబె బుట్టబొమ్మలు, యక్షగాన కళాకారులు ఆకట్టుకున్నారు. రేణుకా ప్రభాకర్ శిష్యబృందం గోదాకల్యాణం, కూచిపూడి నృత్య రూపకం అలరించాయి. చిన్న పిల్లలకు భోగి పళ్ల ఉత్సవాన్ని నిర్వహించారు.



నల్లగండ్లలోని అపర్ణాగ్రాండే గేటెడ్ కమ్యూనిటీలో ప్రసాదం తయారు చేస్తున్న మహిళలు



గంగారంలో అయ్యప్ప ఆలయం ఎదుట భోగి మంటలు..



శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాలు

'లక్షగొంతులు, వేయిడప్పుల' పేరిట పతంగుల ఆవిష్కరణ



పతంగులను ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు గణేశ్, నాయకులు

రాయదుర్గం: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ చిత్రంతోపాటు చలో హైదరాబాద్ కార్యక్రమంలో భాగంగా 'లక్ష గొంతులు, వేయిడప్పుల' కార్యక్రమం పేరిట ప్రత్యేక పతంగులను తయారు చేయించారు. వాటిని రాయదుర్గంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు శ్యాంలేట్ గణేశ్ మాదిగ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫిబ్రవరి 7న నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని ప్రచారం చేసేందుకే ఈ పతంగులను రూపొందించినట్లు పేర్కొన్నారు. మంగళవారం ఉదయం 11 గంటలకు స్థానిక ఊరపోచమ్మ ఆలయం వద్ద ఈ పతంగులను పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు నర్సింహా, నాయకులు త్రినాథ్, మహేశ్, బాలు స్థానికులు పాల్గొన్నారు.

నియామకం



ఎర్ర స్వామి

మోతీనగర్: మూసాపేట డివిజన్ బీజేపీ అధ్యక్షుడిగా ఎర్ర స్వామిని జిల్లా ఎన్నికల అధికారి తాళోజి ఆచారి సోమవారం ప్రకటించారు. ఈ సందర్భంగా ఎర్ర స్వామి మాట్లాడుతూ..పార్టీని సంస్థాగతంగా పటిష్ట పరచడానికి తన శాయశక్తుల కృషి చేస్తానని తెలిపారు. రాబోయే రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేస్తానన్నారు. తనను అధ్యక్షుడిగా నియమించినందుకు కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్, తనకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

మహిళలకు ముగ్గుల పోటీలు



విజేతలకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

శేరిలింగంపల్లి: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని గుల్‌మోహర్‌పార్కు కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పవన్ కన్‌స్ట్రక్షన్ పర్యవేక్షణలో ఆదివారం రాత్రి ముగ్గుల పోటీలు నిర్వహించారు. న్యాయనిర్ణేతలుగా పద్మకుమారి, లక్ష్మి, హైమవతి, కృష్ణకుమారి వ్యవహరించారు. సూపర్ సీనియర్స్ విభాగంలో కలమలమ్మ, వీరమణి, లీలావతి మొదటి మూడుస్థానాల్లో, సీనియర్స్ విభాగంలో కల్యాణి, ప్రవళిక, వి.సౌజన్య, జూనియర్స్ విభాగంలో డి దీపిక, జి అక్షర, టి నందిప్రియ మొదటి మూడుస్థానాల్లో నిలిచారు. విజేతలకు కాలనీ అధ్యక్షుడు షేక్‌ఖాసీం, ప్రధాన కార్యదర్శి ఎస్ ఆనంద్‌కుమార్ సోమవారం బహుమతులు అందించారు. కార్యక్రమంలో పవన్ నిర్మాణ సంస్థ నిర్వాహకులు కందుల వెంకటేశ్వర్లు, అసోసియేషన్‌కు చెందిన మోహన్‌రావు, రఘురామ్, ప్రభాకర చారి, కిశోర్‌బాబు, రానివిక్టోరియా, శ్రీనివాసులు, నబీరసూల్, ఎండీ.షకీల్, శ్రీనివాస్, నర్సయ్య స్థానికులు పాల్గొన్నారు.

కమనీయం.. గోదా కల్యాణం



ఐడీఎల్ చెరువు సమీపంలోని రంగనాయక స్వామి ఆలయంలో కల్యాణం జరిపిస్తున్న అర్చకుడు

మోతీనగర్: పాండురంగనగర్‌లోని ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో డిసెంబర్ 16 నుంచి ప్రారంభమైన ధనుర్మాస ఉత్సవాలు సోమవారం వరకు ఘనంగా నిర్వహించారు. సోమవారం ముగింపు సందర్భంగా గోదా రంగనాథ స్వామి కల్యాణం జరిగింది. ఈ సందర్భంగా ఆయన కార్య నిర్వాహణాధికారి జీఏకే కృష్ణ మాట్లాడుతూ.. అన్ని పండుగలకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

వివేకానందనగర్‌లో..

వివేకానందనగర్‌లోని భూనీల వేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం గోదా రంగనాథ స్వామి కల్యాణంతో ఘనంగా ముగిశాయి. అమ్మవారికి మన్నేపల్లి వరుణ్‌కుమార్, సుస్మిత దంపతులు అమ్మవారికి బంగారు మంగళ సూత్రాలను ఆలయ వ్యవస్థాపక చైర్మన్ పులిగొళ్ల శ్రీనివాస్ యాదవ్‌కు అందజేశారు.

కూకట్‌పల్లిలో..

మూసాపేట: కూకట్‌పల్లి ఐడియల్ చెరువు సమీపంలోని రంగనాయక స్వామి ఆలయంలో సోమవారం గోదాదేవి రంగనాయక స్వామి కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. భక్తుల నడుమ, వేద మంత్రాల సాక్షిగా స్వామి వారి కల్యాణం జరిగింది. కూకట్‌పల్లి, మూసాపేట పరిసర ప్రాంత ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తలంబ్రాలను వీక్షించారు. ఉదయం ప్రత్యేక పూజలు అనంతరం స్వామివారి కల్యాణం, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

మహా రుద్రయాగంతో ముగిసిన యాగాలు



పూర్ణాహుతి యాగం నిర్వహిస్తున్న విష్ణుభట్ల లక్ష్మీ నరసింహ శర్మ

మోతీనగర్: యజ్ఞహోమాలు నిర్వహించడం వల్ల శాంతి సౌభాగ్యాలు, సుఖః శాంతులు కలిగి ప్రజలందరూ సుభిక్షంగా ఉంటారని భరద్వాజ శ్రీ విద్యాపీఠం వ్యవస్థాపకుడు విష్ణుభట్ల లక్ష్మీ నరసింహ శర్మ పేర్కొన్నారు. మోతీనగర్ కమ్యూనిటీ హాల్‌లో భరద్వాజ శ్రీ విద్యాపీఠం, ఎంసీహెచ్‌ఎస్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 3 నుంచి ప్రారంభమైన లక్ష్మీనారాయణ చండీ మహా రుద్రయాగం ఈ నెల 13 వరకు నిర్వహించారు. ఉదయం 4 గంటలకు మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్ర పూర్వక పూజలు, ఉదయం 7 గంటలకు ఆవరణలో దేవత హోమం, 9 గంటలకు మహా రుద్ర యాగం, మహా పూర్ణాహుతితో ఘనంగా ముగిసింది. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పౌరోహితులకు నూతన వస్త్ర సంభావనను ఎంసీహెచ్‌ఎస్ మాజీ అధ్యక్షుడు నలమాల్పు అంజిరెడ్డి దంపతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు బిజముల నాగేశ్వరరావు, నాయకులు సురేష్, రమణ, బొమ్మగాని సత్యనారాయణ గౌడ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సుల్తాన్‌పూర్ ఇంజినీరింగ్ కళాశాలను సందర్శించిన వీసీ



కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూ సుల్తాన్‌పూర్ ఇంజినీరింగ్ కళాశాలను వైస్ చాన్సలర్, ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి, రిజిస్ట్రార్ డాక్టర్ వెంకటేశ్వరరావు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నరసింహ, ఫార్మసీ ప్రిన్సిపాల్, ప్రొఫెసర్ సునీతారెడ్డి, ఇతర బోధనా సిబ్బంది వీసీకి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వైస్ చాన్సలర్ కళాశాలలోని తరగతి గదులు, గ్రంథాలయం, వసతి గృహాలు, భోజనశాలను పరిశీలించారు. కళాశాల అధ్యాపకులు గడియార స్తంభం, ఆడిటోరియం నిర్మాణం, ఫార్మసీ కళాశాల విస్తరణకు ప్రతిపాదనలు సమర్పించారు. ఈ ప్రతిపాదనలను పరిశీలించిన వీసీ రిజిస్ట్రార్‌తో చర్చించి వాటిని అమలు చేయాలని ఆదేశించారు.

ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ ఎన్నిక

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని ఖానాపూర్ గ్రామ ఎమ్మార్పీఎస్ నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. మండల ఇన్‌చార్జి పి.గణేష్ మాదిగ, మాజీ సర్పంచ్ ఆర్. నర్సింహ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అధ్యక్షుడిగా పి.శంకర్‌మాదిగ, ఉపాధ్యక్షుడిగా డి.రవీందర్ మాదిగ, ప్రధాన కార్యదర్శిగా ఆర్.పోచయ్య మాదిగ, కార్యదర్శిగా జి.రాజు మాదిగ, కోశాధికారిగా ఎల్.ఆనంద్‌మాదిగ, అధికార ప్రతినిధిగా వై.ప్రకాశ్‌మాదిగలను ఎన్నుకున్నారు. వీరితోపాటు కార్యవర్గ సభ్యులుగా సి.యాదయ్య మాదిగ, ఆర్.నర్సింగ్‌రావుమాదిగ, డి.కృష్ణ మాదిగ, హెచ్.సుమన్ మాదిగలను ఎన్నుకున్నట్టు గణేష్‌మాదిగ తెలిపారు.

కేలండర్ల ఆవిష్కరణ

ఆల్విన్‌కాలనీ: జగద్గిరిగుట్ట సగర సంఘం వారి నూతన సంవత్సరం కేలండర్‌ను పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జగద్గిరిగుట్ట సగర సంఘం నూతన అధ్యక్షుడిగా నియమితుడైన నాగరాల రామకృష్ణ సాగర్, ప్రధాన కార్యదర్శి వేముల సుదర్శన్ సాగర్, కోశాధికారి సురాయపల్లి భీమయ్య సాగర్‌ను ఎమ్మెల్యే గాంధీ ఘనంగా సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నూతనంగా ఎన్నుకోబడిన సగర సంఘం నాయకులు సంఘం అభివృద్ధికి నిరంతరం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జి. సంజీవరెడ్డి, చంద్రకాంతరావు, రామకృష్ణగౌడ్, జగద్గిరిగుట్ట సగర సంఘం స్టీరింగ్ కమిటీ చైర్మన్ కె.పి.రాంసాగర్, సభ్యులు సత్యనారాయణ సాగర్, ఆర్.కె. దయాసాగర్, గోపాల్ సాగర్, సభ్యులు పాల్గొన్నారు.

బాలానగర్ రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో..

బాలానగర్: బాలానగర్ రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బాలానగర్‌లోని సామ్రాట్ హోటల్‌లో నూతన సంవత్సర కేలండర్‌ను సోమవారం బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బాలానగర్ రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షులు దొంతిరి సోమిరెడ్డి, ప్రధాన కార్యదర్శి వీరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి తదితరులు

యువతిని ఢీ కొట్టిన కారు

మణికొండ హుడా కాలనీలో ఘటన

మణికొండ: రోడ్డు ఎత్తుగా ఉండటంతో అదుపుతప్పిన కారు స్కూటీపై వెళ్తున్న ఓ యువతిని ఢీ కొట్టింది. దాంతో ఆమెకు తీవ్ర గాయాలు కావటంతో ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటన మణికొండ మున్సిపాలిటీ, హుడా కాలనీలో ఆదివారంరాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... హుడా కాలనీలోని లైట్ అండ్ లైట్ వద్ద భాగ్యలక్ష్మి కాలనీ వైపు నుంచి వచ్చిన మారుతి బ్రీజా కారు వచ్చింది. ఓపెన్ జిమ్ వద్ద ఓ మహిళ కారును నడుపుతూ, స్కూటీపై వస్తున్న ఎంప్లాయీస్ కాలనీకి చెందిన గాయత్రిని ఢీకొట్టింది. కారు, ఓపెన్ జిమ్ గోడ మధ్యల గాయత్రి చిక్కుకోవటంతో తీవ్రగాయాలై అపస్మారక స్థితిలోకి వెళ్లింది. గాయాలపాలైన యువతిని వెంటనే మణికొండలోని ఆవాస ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం కిమ్స్ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమంగానే ఉందని వైద్యులు తెలిపారు.